దయ చూపించేనా!

- కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు
- కార్యాచరణ ప్రకటించని కూటమి ప్రభుత్వం
- గురజాల నియోజకవర్గంలో 1,500 మంది కొత్త అర్హులు !


పింఛన్ కోసం దరఖాస్తుకు క్యూ కట్టిన దృశ్యం(ఫైల్)

గురజాల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా కొత్త పింఛన్ల జారీపై ఇప్పటివరకు ఎటువంటి కార్యాచరణను రూపొందించలేదు. దీంతో కొత్తగా అర్హత సాధించిన ఎంతో మంది పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. దరఖాస్తులు పట్టుకుని రోజూ సచివాలయాల చూట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. వెబ్ సైట్ ఓపెన్ కావట్లేదని సిబ్బంది చెప్పే సమాచారం విని నిరాశగా వెనుదిరుగుతున్నారు.

గత ప్రభుత్వంలో అందరికీ పింఛన్లు

గత ప్రభుత్వం హయాంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్లు చొరవ చూపి మంజూరయ్యేలా చూసేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. ఇప్పుడా ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల దరఖాస్తు వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది.

అర్హులు నిరీక్షణ

గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 82 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 43,921 మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. గత ప్రభుత్వం చివరి దశలో కొంతమంది అర్హులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పింఛన్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. గత ఏప్రియల్‌లో నిలిచిన వెబ్‌సైట్ ఇప్పటివరకు తెరుచుకోలేదు. గత ఆరు నెలల కాలంలో దివ్యాంగ, వితంతు, వృద్ధాప్య పింఛన్ల కోసం కొత్తగా ఎంతోమంది అర్హత సాధించారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకు పింఛన్లు అందచేయనున్నట్లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. గురజాల నియోజవకర్గంలో సుమారుగా 1,500 మంది కొత్తగా పింఛన్ల కోసం నిరీక్షిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయని కూటమి ప్రభుత్వం పాత పింఛన్లనే రూ.వెయ్యి పెంచి ఇస్తూ ప్రచారార్భాటం చేస్తోంది.

ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్ లబ్ధిదారులు ఇలా..

మండలం	సచివాలయాలు	పింఛన్‌దారులు
గురజాల	18	9,796
దాచేపల్లి	17	10,126
మాచవరం	15	7,417
పిడుగురాళ్ల టౌన్	17	7,459
పిడుగురాళ్ల రూరల్	15	9,123
మొత్తం	82	43,921

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



కొత్త పింఛన్లపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదు. త్వరలో ఆదేశాలు వస్తాయని అనుకుంటున్నాం. మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రాగానే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. నిబంధనల ప్రకారం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారికి పింఛన్ మంజూరయ్యేలా చూస్తాం. ఆదేశాలు రాగానే స్వీకరిస్తాం.

– గౌసియా బేగం, ఎంపీడీవో, గురజాల

క్లుప్తంగా

అబ్దుల్ కలాం అవార్డుతో సన్మానం



దాచేపల్లి : డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ అవార్డును నారాయణపురానికి చెందిన అంబటి శ్రీనివాసరావు అందుకున్నారు. విద్యారంగంలో శ్రీనివాసరావు అందించిన విశిష్ట సేవలను సౌత్‌రన్ ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ గుర్తించి ఈ అవార్డును ప్రకటించింది. గుంటూరు ఏజీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు దంపతులకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అవార్డును, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. అవార్డు పొందిన శ్రీనివాసరావును స్థానికులు అభినందించారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



దాచేపల్లి : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. దాచేపల్లిలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఫాం ఎస్, ఫాం ఎమ్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎరువుల దుకాణాల యజమానుల సమావేశం రంగనాయకస్వామి దేవాలయంలో నిర్వహించారు. అమ్మకపు బిల్లులపై రైతుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని, డీలర్లు గడువులోపే లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని ఏడీఏ చెప్పారు. గడువు దాటిన పురుగుల మందులు విక్రయించవద్దని, దుకాణాల్లో నిల్వ కూడా చేయవద్దని సూచించారు. ఈ తనిఖీల్లో ఏవో డి.పాపకుమారి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కినపల్లి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



రెంటచింతల: అనారోగ్యంతో కార్పొరేట్ వైద్యం పొందిన పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం అని మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రెంటచింతలకు చెందిన బోయిన లక్ష్మమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.76,572 చెక్కును ఆయన పార్టీ నేతలతో కలిసి అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, పార్టీ నాయకులు మూలి రాయపరెడ్డి, మొండెద్దు చిన శౌర్రెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు సద్ది



దాచేపల్లి : స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు సద్ది కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్, ఆలయ కమిటీ సభ్యులు యలమల నరేష్‌ల పర్యవేక్షణలో 41 రోజుల పాటు మాలధారులకు ఉచితంగా సద్దిని ఏర్పాటు చేయనున్నారు. అంకమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు చేసిన తరువాత నవకుమార్ సద్ది పంపిణీని ప్రారంభించారు. అయ్యప్ప మాలధారులకు సద్దిని ఏర్పాటు చేయటంతో తమ జన్మధన్యమైందని, 41 రోజుల పాటు ఎంతమంది మాలధారులు వచ్చినా సద్దిని అందిస్తామని నవకుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, డీసీ చైర్మన్ నర్రా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచార బోర్డు మార్చండి



మాచర్ల రూరల్ :స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దర్శనమిస్తున్న ఈ బోర్డు నాలుగేళ్ల నాటిది. ఇప్పటికీ దీనిని మార్చలేదు. అధికారులు మారిపోయినా పాత వారి పార్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ బోర్డును మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాదరావు

వెల్దుర్తి: వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రసాదరావు చెప్పారు. సోమవారం ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సమాజంలో అందరికీ జీవితకాలం అభ్యసనం, అవగాహన అనే కొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమంతోపాటు జీవన నైపుణ్యాలలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటమే ఈ పథకం లక్ష్యమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వివరాలు సేకరించి ప్రతి రోజూ రెండు గంటల పాటు వయోజనులకు బోధన నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు రవిగోవర్ధన్, పూర్ణచంద్రరావు, దుర్గ, వెలుగు ఏపీఎం అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ కోటయ్యకు నివాళి


కామ్రేడ్ కోటయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్త

దుర్గి: పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాడి అమరుడైన కామ్రేడ్ బరిసె కోటయ్య సంస్మరణ సభను సోమవారం అడిగొప్పల గ్రామంలో నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విప్లవ రాజకీయాలలో కామ్రేడ్ బరిసె కోటయ్య చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో మృతిచెందటం బాధాకరమని పేర్కొన్నారు. పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె. శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, కేఎస్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.కృష్ణ, సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్రహం లింకన్, జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు వినుకొండ పేరయ్య, శిఖరం చిన్నా, కంబాల ఏడుకొండలు, వి.కోటా నాయక్, షేక్ గఫూర్, అరుణ, జి రామకృష్ణ, బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో వరిపంట సాగు చేస్తున్న రైతులకు వ్యవసాయ శాఖ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన మందు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో మండలంలో మొత్తం 5,728 ఎకరాలలో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఎలుకల వలన ఎక్కువ పంట నష్టం కలుగుతుందని, దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి రైతుకు ఎలుకల నిర్మూలన మందును పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సబ్సిడీ శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి


శనగ విత్తనాలను రైతులకు అందజేస్తున్న ఎంపీపీ సాయిశంకర్

దుర్గి: రబీ సీజన్‌లో సాగు చేయనున్న శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామంలో సోమవారం ఎంపీపీ యేచూరి సాయిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను రైతులకు అందజేయటంపై సంతోషం వ్యక్తం చేశారు. ఏఓ వై.అమీర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక క్వింటా కేఏకే-2 రకం ధర రూ. 12,100లని, సబ్సిడీ రూ.3,025 పోను రూ. 9,075లు రైతు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జెజి-11 రకం రూ.7,050కు సబ్సిడీతో సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నం మహేష్, అలవాల శ్రీనివాసరావు, మునుగోటి పార్వతయ్య, ప్రత్తిపాటి శివరామకృష్ణ, ఉన్నం రాజశేఖర్, వ్యవసాయ సహాయకులు ఆర్.కళ్యాణ్ నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు క్యాంపులు

మాచవరం: రాష్ట్ర ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మంగళవారం నుంచి మండలంలోని పలు గ్రామాల సచివాలయ పరిధిలో ఆధార్ కార్డుల అప్‌డేషన్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. 22, 23న మాచవరం, మోర్జంపాడు జడ్పీ హైస్కూల్, 24న మాచవరం, మోర్జంపాడు, గంగిరెడ్డిపాలెం, కొత్తపాలెం గ్రామ సచివాలయాలలో క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

గురజాల : యువతి అదృశ్యంపై కేసు నమోదైనట్లు ఎస్ఐ వై.వినోద్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గురజాలకు చెందిన యువతి రెండు రోజుల నుంచి కనిపించకుండా పోయింది. యువతి కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో ఉందనే అనుమానంతో వెతికారు. ఎక్కడా లేకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతుల రీసర్వే సమస్యలకు వెంటనే పరిష్కారం


గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

తుమ్మకోట(రెంటచింతల): గ్రామాలలో రీసర్వే సమస్యలపై రైతులు గ్రామ సభలలో అర్జీలు ఇచ్చిన వెంటనే పరిష్కరిస్తామని ఆర్ఐ పల్లా రామకృష్ణ చెప్పారు. సోమవారం మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆర్ఐ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన రీసర్వేపై సమస్యలు ఉంటే అర్జీలు అందించాలని సూచించారు. దీంతో గ్రామానికి చెందిన రైతులు ఐదు అర్జీలను అందజేయగా వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సభలో వీఆర్వో నర్సింహారావు, గ్రామ సర్వేయర్‌లు అర్జున్, బాలసైదులు, రైతులు పాల్గొన్నారు.

తొండపిలో ఇరువర్గాల ఘర్షణ

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రెండు వర్గాల మధ్య మొదలైన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన చింతిరాల సుధీర్, గోవిందు నాగయ్య మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. కొద్దిసేపటి తర్వాత గోవిందు నాగయ్య, మరికొంత మంది టీడీపీ మద్దతుదారులైన బోరుపోతు ఊదా, బోరుపోతు నాగేశ్వరరావు, సామ్యేలురాజు, మోహన్, మరికొంత మందితో కలిసి కర్రలు, ఇనుపరాడ్లతో చింతిరాల సుధీర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులపై దాడికి దిగారు. గమనించిన సుధీర్ బంధువులు ఇంటిపైకి వచ్చి కొట్టడమేంటని ప్రశ్నిస్తుండగా వారిపైనా విచక్షణా రహితంగా కర్రలతో దాడికి దిగారు. దాడిలో చింతిరాల సుధీర్‌కు, సుధీర్ తండ్రి వీరయ్య, తల్లి నాగమ్మ, అత్త మరియమ్మకు, అత్తోట విజయబాబు, బోరుపోతు రాజాకు గాయాలయ్యాయి. దాడుల నుంచి తప్పుకునే క్రమంలో మరో వర్గానికి చెందిన బోరుపోతు ఊదా, భిక్షాలు, నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి.

బాలికలు క్రీడల్లో రాణించాలి


ఎంపికైనా బాలికల జట్టుతో ఉపాధ్యాయులు

శావల్యాపురం: రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బాలికలు ఎంపిక కావటం అభినందనీయమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. స్థానిక పాఠశాలలో ఎంపికైన బాలికల అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 20న ఉమ్మడి గుంటూరు జిల్లా ఎన్‌జీవో హోమ్స్ క్రీడా మైదానంలో సీనియర్ బాలికలకు బాల్‌బ్యాడ్మింటన్‌లో జిల్లా ఎంపిక పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఆకుమళ్ల సమీరా, కె.కావ్య, ముట్లూరి లాధియా, వేముల దివ్య, బి. దేవమణి, ఓర్సు ప్రవంతి ,ఆర్.రత్నకీర్తన, ముక్కపాటి లిఖిత, యు.బసవరాణిలు రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం సాధించినట్లు చెప్పారు. నవంబరు 8 నుంచి 10 వరకు నంద్యాలలో నిర్వహించనున్న 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైనా బాలికల జట్టు పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనా బాలికల జట్టును పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, భువనేశ్వరి, సురేష్,శ్రీకాంత్, నిర్మల,కిరణ్మయి, అబ్దుల్లా అభిందించారు.

వివిధ క్రీడా పోటీల్లో గుడ్‌షపర్డ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

వినుకొండ(నూజెండ్ల): ఖోఖో అండర్ -18 విభాగంలో జిల్లా జట్టుకు ముగ్గురు ఎంపిక అయినట్లు గుడ్ షపర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మీసునీత సోమవారం తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో విష్ణువర్ధన్, నాగరాజు, మణికంఠ ప్రతిభ చూపినట్లు చెప్పారు. అదే విధంగా నరసరావుపేటలో నిర్వహించిన అండర్- 14 విభాగం సాఫ్ట్ బాల్ పోటీల ఎంపికలో మోహన్‌గోపి, రాకేష్, రామకోటేశ్వరరావు, షటిల్ బ్యాడ్మింటన్‌లో కమల్‌కుమార్ జిల్లా జట్టుకు అర్హత సాధించారని పేర్కొన్నారు. కారంపూడిలో నిర్వహిచిన ఖోఖో అండర్ -14లో విభాగంలో ఆంజనేయనాయక్, నాగవేణి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి, మంజుల రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు అజీమ్, వెంకట్, కొండలు, తిరుపతమ్మ అభినందించారు.

సెంట్రల్‌జోన్ బ్యాడ్మింటన్ విజేత 'ఎన్ఈసీ'


క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ పురుషుల బ్యాడ్మింటన్ పోటీలలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించిన అంతర కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలలో కళాశాల జట్టు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ పోటీలలో విజేతగా నిలిచిన జట్టులోని క్రీడాకారులు ఎస్.ధనుష్, ఎ.నాగేంద్ర, పి.బాలసతీష్, ఆర్.ఆదిత్యచరణ్‌లను అభినందించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, వ్యాయామ అధ్యాపకుడు ఎల్.కృష్ణారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థికి రెండు బంగారు పతకాలు


భవనాశి వంశీ వేదాన్ష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి సంసిద్ పాఠశాల యూకేజీ విద్యార్థి భవనాశి వంశీ వేదాన్ష్ అండర్-7 కేటగిరి ఇన్‌లైన్ రింగ్స్ పోటీల్లో జిల్లా స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ సురేష్ సోమవారం తెలిపారు. మాట్లాడుతూ నవంబరు 6న జరగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్‌తో పాటు 62వ జాతీయ స్థాయి పోటీల్లో మంచి ప్రదర్శన కనపరిచి పాఠశాలకు అకాడమీకి మంచి పేరు తేవాలన్నారు. ఎంపికైనా విద్యార్థి వంశీ వేదాన్ష్‌ను చాణిక్య స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ చైర్మన్ నాగార్జున, కోచ్ శర్మ, మేనేజరు ప్రసన్నకుమార్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

తాగునీటి కోసం పొలం బాట

- మోటార్లు పనిచేయవు
- గండిగనుమల ప్రజలకు కష్టాలు
- అధికారులు కన్నెత్తిచూడరు


సమీపంలోని పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్న గండిగనుమల గ్రామస్తులు

బొల్లాపల్లి: పల్లె ప్రజలు తాగునీటికి నోచుకోవడం లేదు. అధికారుల చిత్తశుద్ధి లేకపోవడంతో మోటార్లు మొరాయిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు భూగర్భజలాలు వృద్ధి చెందిన వారికి నీరు అందడం లేదు. గ్రామంలో నెలకొన్ని రాజకీయాలు కూడా గ్రామస్తులకు శాపంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో తాగునీరు ఉన్నా కొన్ని ప్రాంతాల్లో మోటార్లు పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇది మండలంలోని గండిగనుమల గ్రామంలో వేధిస్తున్న తాగునీటి సమస్య.

తాగునీటి సరఫరా ఇలా..

గ్రామంలో దాదాపుగా మూడువేల మందికి పైగా జనాభా ఉంది. 700 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆయా కుటుంబాలతో పాటు పశువులు, జీవాలకు నీటి అవసరం ఉంది. రక్షిత తాగునీరు అందించేందుకు గ్రామంలో మినీ ట్యాంక్, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం, నిర్వహణ లోపంతో మోటార్లు మొరాయిస్తున్నాయి. 10 నుంచి 15 వరకు సింగిల్‌ఫేస్ మోటార్లు పనిచేయడం లేదు. గతంలో వర్షాలు సకాలంలో కురవక భూగర్భజలాలు అడుగంటి నీటి కొరత తీవ్రంగా ఉండేది. కాని ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రామపరిధిలో భూగర్భజలాల నీటి మట్టం పెరిగింది. అయినా ఎన్నో ఏళ్లగా ఉన్న నీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. నీటి సరఫరా సరిపోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

తాగునీటి కోసం పొలాలకు..

సమీపంలోని పొలాల్లోకి వెళ్లి నీరు మోసుకోవాల్సిన పరిస్థితి. ఉదయం పనులకు వెళ్లి సాయంత్రం పొలాలకు వెళ్లి నీరు మోసుకోలేక పోతున్నామని, పశువులకు సరిపడ నీరు అందించలేకపోతున్నామని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికార యంత్రాంగం స్పందించి సింగల్ ఫేజ్ మోటార్లు మరమ్మతులు చేపట్టి నీటి సమస్య లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులో లేరు.

పట్టించుకోని పాలకులు..


మరమ్మతులకు నోచుకోకపోవడంతో గ్రామంలో నీటి సమస్య జఠిలమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి సమస్య గురించి పట్టించుకోవడం లేదు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయని సింగిల్ ఫేజ్ మోటార్లకు మరమ్మతులు చేయిస్తే గ్రామంలో నీటి సమస్య ఉండదని గ్రామానికి చెందిన కొందరు రైతులు చెబుతున్నారు.


మరమ్మతులకు గురైన సింగిల్‌ఫేజ్ మోటారు

నేడు కేంద్ర బృందం రాక

మాచవరం: మండంలోని పలు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం మంగళవారం రానున్నట్లు ఏపీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ శాఖకు సంబంధించిన సిబ్బంది అందుబాటులో ఉండాలని వివరించారు.

పోలీసు అమరులకు ఘన నివాళి


అమరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఐ బాలకృష్ణ

నాదెండ్ల: యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. తొలుత అమరుల చిత్రపటాల వద్ద ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన అమరలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు.